నిధులున్నా.. పనులేవి?

- అంగన్‌వాడీ భవన నిర్మాణాల్లో జాప్యం
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, చిన్నారులు


తాంసిలో పిల్లర్ల దశలో నిలిచిన అంగన్‌వాడీ భవన నిర్మాణం

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో స్థానిక పాఠశాల భవనాల్లో, అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. దీంతో వారికి సరిపడ స్థలం లేకపోవడం, వసతులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. చిన్నారులు, గర్భిణుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరై ఏడాది అవుతున్నా.. పలుచోట్ల ఇప్పటికీ పనులు ప్రారంభించ లేదు. పలు గ్రామాల్లో పనులు చేపట్టినా.. నిధులు మంజూరు కాలేదనే కారణంగా నిలిచిపోయాయి.

20 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు..

భవన నిర్మాణాలు కొన్నిచోట్ల అర్ధాంతరంగా నిలిచిపోవడం, కొన్ని గ్రామాల్లో నేటికి నిర్మాణ పనులు పారంభించ లేదు. ఎప్పుడు ప్రారంభిస్తారోనని ప్రజలు అయోమయంలో ఉన్నారు. ఉమ్మడి తాంసి మండలంలో మొత్తం 71 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ప్రస్తుతం 20 కేంద్రాలకు మాత్ర మే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన కేంద్రాలు పాఠశాల ఆవరణలోని గదుల్లో, మరికొన్ని అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు.

ఆరు అంగన్‌వాడీలకు నిధులు..

తాంసి, భీంపూర్ మండలాల్లో ఆరు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి గత ఏడాది నిధులు మంజూరు అయ్యాయి. తాంసి మండలంలో తాంసి, కప్పర్ల, గిరిగాం గ్రామాలకు మంజూర్ చేశారు. భీంపూర్ మండలంలో అర్లి(టి), గోముత్రి, తాంసి(కె) గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణానికి నిధులను కేటాయించారు. భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.12 లక్షల చొప్పున కేటాయించారు. కాగా వీటిలో తాంసి మండల కేంద్రంలో భవనం నిర్మాణం ప్రారంభించగా.. ఆరు నెలల నుంచి పిల్లర్ల దశలోనే ఉంది. కప్పర్ల గ్రామంలో సైతం నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. గిరిగాం పనులు చేపట్టడానికి ఎవరూ ముందుకు రాలేదు. అర్లి(టి)లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గోముత్రి, తాంసి(కె)లో పనులు ప్రారంభం కాలేదు. అధికారులు స్పందించి భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. మండల కేంద్రంలో ఉన్న మూడు అంగన్‌వాడీలు ప్రస్తుతం పాఠశాల గదుల్లో కొనసాగుతున్నాయి. శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. అధికారులు త్వరగా భవన నిర్మాణాలను పూర్తి చేయాలి.

– నగరం అశోక్ కుమార్, తాంసి

పనులు పూర్తయ్యేలా చూస్తాం

ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చూస్తాం. మండలంలో ప్రస్తుతం ఆరు అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు మంజూరయ్యాయి. వీటిలో తాంసి, కప్పర్ల, అర్లి(టి) గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి. వీటిని త్వరగా పూర్తి చేసే విధంగా కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు పూర్తి చేయిస్తాం.

– మహేందర్, పంచాయతీరాజ్ ఏఈ తాంసి

క్లుప్తంగా

బెల్ట్‌షాపులు తొలగించాలి


మాట్లాడుతున్న కల్లెపెల్లి గంగయ్య

ఇచ్చోడ: మండల కేంద్రంలో బెల్ట్‌షాపులను వెంటనే తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పలు కాలనీల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు పెట్టడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కొన్ని బెల్ట్‌షాపులలో కల్తీమద్యం, మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చిన మద్యం విక్రయిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో మసీదు రాజేశ్వర్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

భగవాన్పుర్‌లో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

భీంపూర్: మండలంలోని జల్కోరి, భగవాన్పుర్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య విస్తరణ అధికారి జ్ఞానేశ్వర్, సిబ్బంది మాయావతి, ఉమా, జానాభాయ్, విజయలక్ష్మి, భాగ్యవతి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


బ్యాగులు పంపిణీ చేస్తున్న మౌనిష్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మయూరి, పాఠశాల కమిటీ చైర్మన్, ఊష, సురేందర్ రెడ్డి, ప్రసాద్ చారి, ఆశన్న యాదవ్, దినేష్ రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత అన్నారు. కళాశాలలో చదివిన విద్యార్థిని గెడం కరుణ హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ హిందీలో సీటు సాధించడం పట్ల శనివారం కళాశాలలో సన్మానించారు. విద్యార్థిని తోటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో లెక్చరర్లు రాడపు సంతోష్, రాధ, నందకుమార్, శ్రావణి, శ్రీధరదేవి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియేట్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ అశోక్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 18 వరకు గడువు ఉందన్నారు. అపరాధ రుసుంతో ఆగస్టు 28 వరకు గడువు ఉందన్నారు. ఆన్‌లైన్‌లో అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

పాఠశాలలో మాక్ పోలింగ్


మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గోల్డెన్ లీఫ్ పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులే ఎన్నికల అధికారులుగా విధులు నిర్వహించగా, ప్రతీ విద్యార్థి బ్యాలెట్ పద్ధతి ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నారు. అనంతరం కౌంటింగ్ నిర్వహించి ఎన్నికలలో గెలుపొందిన వారిని ప్రకటించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాథోడ్ మౌనిక మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. పాఠశాలలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నేరడిగొండ: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు హెల్త్ అసిస్టెంట్ హెల్త్ సూపర్‌వైజర్ ఎ.సంతోష్ అన్నారు. శనివారం మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంబారావు, ఏఎన్ఎంలు అశ్విని, జ్యోతి, రమాదేవి పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని తెలంగాణ సామాజిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన హాస్టల్‌లో శనివారం సొనాల సబ్ సెంటర్ వైద్య సిబ్బంది విద్యార్థులకు హెల్త్ ప్రొఫైల్ స్క్రీనింగ్ నిర్వహించారు. జూలై 31 నుంచి ఆగస్టు 4 వరకు నిర్వహిస్తున్నట్లు వైద్య బృందం సిబ్బంది తెలిపారు. విద్యార్థులకు రక్తపరీక్షలు, సామాన్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు హాస్టల్ పరిసరాల పరిశుభ్రత కూడా అత్యంత కీలకమని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కవిత, ఎంఎల్‌హెచ్‌పీ సాయిప్రియ, ఏఎన్ఎం సవిత, ఆశ కార్యకర్త వీణ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పిస్తాం

సాక్షి ఎఫెక్ట్..


బోరు మోటర్‌కు మరమ్మతు చేయిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: మండలంలోని తెజాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సాలేగూడ గ్రామంలో నెలకొన్న నీటి సమస్యపై శనివారం సాక్షిలో 'సాలేగూడలో తాగునీటికి తండ్లాట' అనే శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించారు. ఎంపీవో జీవన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పూర్ణలు సాలేగూడ గ్రామానికి సందర్శించి బోరుబావిలో కూరుకుపోయిన మోటర్‌కు మరమ్మతులు చేయించారు, త్వరలోనే కొత్త మోటర్ బిగించి సాలేగూడ గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

తల్లిపాలే శ్రేయస్కరం


అవగాహన కల్పిస్తున్న ఉమాదేవి

ఉట్నూర్‌రూరల్: శిశువులకు తల్లిపాలే శ్రేయస్కరమని ఉట్నూర్ ఐసీడీఎస్ సీడీపీవో మాస ఉమాదేవి అన్నారు. శనివారం ఉట్నూర్ మండలంలోని ఎంఆర్‌వో కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు, గ్రామ పోషణ ఆరోగ్య దినం నిర్వహించారు. అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లిపాలు తాగించాలన్నారు. తల్లిపాల ప్రయోజనాలు, లాభాలపై అవగాహన కల్పించారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ అంగన్‌వాడీలో చేర్పించాలన్నారు. ఆట పాటలతో పాటు విద్య అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జయశీల, ఆరోగ్య కార్యకర్త గొడని బాయి, మంజులత, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ టీచర్ సుజాత అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడ అంగన్‌వాడీ 4, 5 కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు.

న్యాయవాదులు వృత్తిలో తృప్తి పొందాలి


మాట్లాడుతున్న చంద్రయ్య

ఉట్నూర్‌రూరల్: న్యాయవాదులు వృత్తిలో తృప్తి పొందాలని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి, విశ్రాంత మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జి. చంద్రయ్య అన్నారు. శనివారం ఆయన ఉట్నూర్ మేజిస్ట్రేట్ కోర్టును సందర్శించారు. అనంతరం కోర్టు హాలులో న్యాయవాదులతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఉట్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. బాపురెడ్డి, ఉపాధ్యక్షుడు బానోత్ జగన్ నాయక్, జైవంత్ రావు, శ్రీనివాస్, పవార్ వసంత్ రావు, కుడెల్లి అశోక్, చంద్రమౌళి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

బెల్టులు, ఐడీకార్డుల అందజేత


బెల్టులు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

తలమడుగు: మండలంలోని కప్పర్ దేవి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు బెల్టులు, ఐడీకార్డులు శనివారం హెచ్ఎం ప్రపుల్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు సమానంగా ఉండాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీవో సభ్యురాలు లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతో అనేక ఉపయోగాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాలూరి గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్: యోగాతో అనేక ఉపయోగాలు ఉన్నాయని ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం శాంతినగర్‌లో ఆవిష్కరించారు. ఆదిలాబాద్ జిల్లాలోనే తొలి సారిగా రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆగస్టు 7, 8 తేదీల్లో మావలలోని రత్న గార్డెన్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్, సీనియర్ యోగాసన ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఎంపిక పోటీల్లో ట్రెడిషనల్ యోగాసన, ఫార్వర్డ్ బెండింగ్, బ్యాక్ బెండింగ్, ట్విస్టింగ్, లెగ్ బ్యాలెన్స్, హ్యాండ్ బ్యాలెన్స్, ఆర్టిస్టిక్ యోగాసన, రిథమిక్ యోగాసన ఉంటాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షుడు అన్వేష్ బాబు, సంతోష్, ప్రజోత్, రాకేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలోని సక్రియనాయక్ తండా గ్రామానికి చెందిన జాదవ్ శీలాబాయి తేర్వీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై శీలాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

కొనసాగుతున్న శబరిమాత అఖండ జ్యోతి

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామంలో 45 రోజుల పాటు కొనసాగుతున్న అఖండ జ్యోతి కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు జై భరత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కిరణ్ కుమార్, గంగన్న, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


వినతిపత్రం ఇస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

నార్నూర్: మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాన్ని చెల్లించాలని శనివారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఐదు నెలలుగా రెగ్యులర్ ఉద్యోగస్తులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నామన్నారు. కనీసం ఇంట్లో నిత్యవసర సరుకులు తీసుకెళ్లని పరిస్థితి ఉందన్నారు. పిల్లల చదువు ఫీజులు కట్టలేక అవస్థలు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆడే మహేందర్, సైయినాథ్, లాహుజీ పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు నిలిపివేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నార్నూర్: ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా మండల కేంద్రంలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని శనివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నార్నూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మోతీరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు అర్కా గోవింద్ మాట్లాడుతూ ఏజెన్సీ హక్కులను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. 1/70, పెసా చట్టాలకు విరుద్ధంగా ఏజెన్సీలో ఎటువంటి అనుమతి లేకుండా నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం ఆదివాసీ సంక్షేమ పరిషత్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో గంగారం, తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగము సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. శనివారం మండలంలోని లక్కారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు తంబాకు దాని ఉత్పత్తులకు సంబంధించిన వస్తువులపై వాడకం వలన కలిగే నష్టాలను వివరించారు. పొగాకు ఉత్పత్తులు తినడం వలన క్యాన్సర్ వస్తుందన్నారు. ఎంఈవో రాపెల్లి ఆశన్న మాట్లాడుతూ.. విద్యార్థులు సన్మార్గంలో నడిచి మంచి పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నేరడిగొండ: వాహనదారులు నిబంధనలు పాటించాలని నేరడిగొండ పోలీసులు అన్నారు. శనివారం బోథ్ ఎక్స్‌రోడ్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతీ వాహనదారుడు వాహన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనం నడపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం


శుభాకాంక్షలు చెప్పుకుంటున్న విద్యార్థులు

బోథ్: మండలంలోని వేదం, నాగభూషణం, విజ్ఞాన్ పాఠశాలల్లో శనివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకొని, ఫ్రెండ్‌షిప్ బాండ్స్‌ను ధరించారు. స్నేహానికి గుర్తుగా జ్ఞాపకాలను పంచుకున్నారు. ఆయా కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. స్నేహం అనేది జీవితంలో అత్యంత విలువైన బంధమని అన్నారు. స్నేహం ద్వారానే వ్యక్తుల మధ్య పరస్పర నమ్మకం, సహకారం, గౌరవం పెంపొందుతుందని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఉట్నూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 వరకు దరఖాస్తుకు గడువు ఉందని, 6న దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూ, 7న గెస్ట్ లెక్చరర్ల నియామకాలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ఫోన్ అందజేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న మమత శుక్రవారం ఊరికి వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకుంది. బస్సు ఎక్కిన తర్వాత ఫోన్‌తో పాటు తన పర్సును మర్చిపోయింది. తర్వాత వెళ్లి చూసే సరికి అవి కనిపించకుండాపోయాయి. దీంతో ఆమె టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఫోన్‌ట్రేస్ చేసి పట్టుకున్నారు. శనివారం వాటిని తిరిగి అందజేశారు.

ధర్నా విజయవంతం చేయండి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో ఈనెల 4 నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

కార్యవర్గం ఎన్నిక

నేరడిగొండ: రాజ్‌గోండ్ సేవా సమితి మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు పంద్రం శంకర్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆత్రం సోనేరావు, అధ్యక్షుడిగా ఆత్రం నగేశ్, ప్రధాన కార్యదర్శిగా జూగ్నక్ ప్రకాష్‌లను సర్మేడి ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లఖంపూర్ రాయి సెంటర్ సర్మేడి ఆత్రం గంగారాం, రోల్‌మామడ పటేల్, అర్క యాదవురావు, మండాడి భీంరావ్, కనక అమృత్ రావ్, మండాడి కృష్ణ పాల్గొన్నారు.

పాదయాత్ర జయప్రదం చేయండి

నేరడిగొండ: ఖానాపూర్ నియోజకవర్గంలోని ఖానాపూర్ మండలంలో ఆదివారం జనహిత పాదయాత్ర నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, తెలంగాణ రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి, ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 7న గోవా రాష్ట్రంలో జరిగే ఓబీసీ 10వ మహాసభ పోస్టర్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు గోవా రాష్ట్రంలో జరిగే మహా సభకు జిల్లాలోని బీసీలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. నాయకులు మేకల అశోక్, నర్సింలు, రవీందర్, వేణుగోపాల్, రాంకుమార్, భోజన్న, నరేశ్, గంగయ్య, విఠల్, రాజు, పద్మావతి, రమాదేవి పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: సబ్ జూనియర్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన చరణ్‌తేజను టీఎన్‌జీవో నాయకులు సన్మానించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో శాలువాతో సత్కరించి రూ.5వేల నగదు అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, నవీన్ కుమార్, రాజేశ్వర్, అరుణ్ కుమార్, సోహెల్, సంజయ్, సంతోష్, రజినీకాంత్, అఖిల్ పాల్గొన్నారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న యశోద

ఆదిలాబాద్‌టౌన్: జాబ్‌మేళాను యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ యశోద అన్నారు. ఈనెల 5న ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో మేళా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శనివారం పట్టణంలోని విద్యార్థి డిగ్రీ కళాశాల, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, గుడిహత్నూర్ డిగ్రీ కళాశాల, మెప్మా, ఎంపీడీవో, ప్రభుత్వ బాలికల వసతిగృహాల్లో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.